హస్తినాపురంలో అక్రమ నిర్మాణాలు

- టౌన్ ప్లానింగ్ సిబ్బంది కనుసన్నల్లోనే..
- ప్రభుత్వ ఆదాయానికి గండి

చంపాపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లో కాలనీలు, ప్రధాన రహదారుల పక్కన జోరుగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందికి ముడుపులు చెల్లించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతి తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

టీకేఆర్ కమాన్ నుంచి జడ్‌పీ రోడ్ వరకు..

హస్తినాపురం డివిజన్‌లో టీకేఆర్ కమాన్ నుంచి గ్రీన్‌ల్యాండ్స్ కాలనీ, భూపేష్‌గుప్తానగర్‌కాలనీ, శ్రీరమణకాలనీ, వెంకటేశ్వరకాలనీ మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు ప్రధాన రహదారికి ఇరువైపుల రేకుల షెడ్స్‌తో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గ్రీన్‌ల్యాండ్స్ కాలనీకి వెళ్లే దారిలో 15 షట్టర్లు నిర్మించి అద్దెకు ఇస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారుల కంటికి కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. కొందరు టౌన్ ప్లానింగ్ సిబ్బంది భూ యజమానులతో కుమ్మక్కై అక్రమ నిర్మాణాలకు పచ్చ జెండా ఊపుతున్నారు. కాలనీలలో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అధికారుల అజమాయిషీ లేకపోవడంతో టౌన్‌ప్లానింగ్ కిందిస్థాయి సిబ్బంది ముడుపులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఇంటి యజమానులకు టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రీన్‌ల్యాండ్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో నిర్మించిన అక్రమ వాణిజ్య నిర్మాణాలు

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కారం

ఆర్డీవో అనంతరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని ఇబ్రహీంపట్నం డివిజన్ ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. భూ సమస్యలు ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. విరాసత్, పేరు మార్పిడి తదితర సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో భూ యజమానుల నుంచి 21 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.



బండరావిర్యాల భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇప్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ కవాడి శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి

సైదాబాద్. జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగివున్న ప్రతిభను గుర్తించాలని సైదాబాద్ మండల రికగ్నైజ్డ్ ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ (ఎస్‌ఎంఆర్‌పీఎస్‌ఏ)అధ్యక్షుడు వీరేందర్ బాబు అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్‌ఎంఆర్‌పీఎస్‌ఏ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ట్రాన్స్‌ఫార్మింగ్ టీచర్స్ సమ్మిట్-2025ను సంతోష్‌నగర్ ఏసీపీ సుఖ్‌దేవ్ సింగ్‌తో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. పిల్లల్లో విద్యాప్రమాణాలు మరింత పెంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ తరగతులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఉపాధ్యాయులకు ఉపయోగపడతాయన్నారు. ఏసీపీ మాట్లాడుతూ మారుతున్న పద్ధతులను ఉపాధ్యాయులు ఆకళింపు చేసుకొని విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రిటైర్డ్ సైంటిఫిక్ ఆఫీసర్ శేషసాయి, అసోసియేషన్ కార్యదర్శి సత్యం, కోశాధికారి మహమూద్ ఐరిస్ సల్మాన్, ప్రతినిధులు సాజిద్, అంకితారెడ్డి, ధర్మేందర్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు వీరేందర్‌బాబు, చిత్రంలో ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్ సింగ్ తదితరులు

ఘనంగా రావి నారాయణరెడ్డి జయంతి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కుంట్లూర్ ఆర్‌ఎన్ఆర్ కాలనీ ఫేజ్-3లో బుధవారం రావి నారాయణరెడ్డి 118 జయంతి వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్ నాయక్, నవనీత, సైదులు, వీరేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి 118వ జయంతిని బుధవారం హయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో రావినారాయణరెడ్డి కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అరుణ్‌కుమార్‌గౌడ్, శోభన్, వంశీవర్ధన్‌రెడ్డి, సక్రు నాయక్, కృష్ణ, సుజాత, సరిత తదితరులు పాల్గొన్నారు.





ఆర్‌ఎన్‌ఆర్ కాలనీ, హయత్‌నగర్‌లో రావి నారాయణరెడ్డికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

కారు యజమానిని హత్య చేసిన వ్యక్తి అరెస్ట్

చాదర్‌ఘాట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కారు యజమానిని హత్య చేసిన నిందితుడిని చైతన్యపురి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం, నారాయణపురం గ్రామ నివాసి గంగ్ర నాగిరెడ్డి(48) కొంత కాలంగా న్యూమారుతీనగర్‌లో వైష్ణవి మౌక్తిక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లా, ద్వారకానగర్ నివాసి జవాజీ కృష్ణ(33) అత్త కామాక్షి అదే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తోంది. కృష్ణ గతనెల 21న ఆమె ఇంటికి వచ్చి కారును అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేశాడు. కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లి వచ్చిన నాగిరెడ్డి తన కారును కృష్ణ కారు వెనక పార్క్ చేసి ఫ్లాట్‌కు వెళ్లాడు. కృష్ణ తన కారుపై గీతలు పడడాన్ని గమనించాడు. కోపోద్రిక్తుడైన అతడు వాచ్‌మన్ కుమారుడు బస్వరాజ్ అక్షిత్ ద్వారా నాగిరెడ్డిని కిందకు పిలిపించాడు. నాగిరెడ్డి కిందకు రాగానే కారుపై గీతలు చూపించి కృష్ణ అతడిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. కేకలకు నాగిరెడ్డి భార్య అన్నపూర్ణ కిందకు వచ్చేసరికి భర్త కిందపడిపోయి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం కొత్తపేట చౌరస్తాలోని ఓమిని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

మృతుడి భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు జవాజీ కృష్ణను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

వనస్థలిపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తిచేయాలని బృందావన్ కాలనీ అధ్యక్షుడు పొనుగుపాటి శశికాంత్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాచకాలువ మీదుగా పనులు ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని అధికారులు తెలిపారన్నారు. పనులు ముందుకు సాగకుండా అడ్డుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

హయత్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపన కోసం కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ. రవీంద్రాచారి అన్నారు. బుధవారం కొహెడ సువరం కాలనీలో ఏర్పాటు చేసిన సీపీఐ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కొహెడ గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రేఖా అండాలు, సహాయ కార్యదర్శిగా ఆవుల అంజమ్మ, సభ్యులుగా ఫాతిమా, లక్ష్మి, అంజమ్మ, యాదగిరి, సత్తెమ్మ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి, మండల కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్, నారాయణరెడ్డి, బాల్‌రాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రాచారి

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

కొత్తపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి కాలనీలో పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేదమంత్రాల మధ్య సాంప్రదాయబద్ధంగా స్వామివార్ల కళ్యాణమహోత్సవం కనుల పండువగా కొనసాగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్నేహపురి కాలనీ సహా పరిసర కాలనీల నుండి ఐదువందల మందికిపైగా భక్తులు కళ్యాణ మహోత్సవానికి విచ్చేసి, కానుకలు సమర్పించుకున్నారు. సాయంత్రం స్వామి వారు ఉభయ దేవేరులతో స్నేహపురి కాలనీ తదితర పురవీధుల్లో గరుడవాహనంపై ఊరేగారు. గోవిందనామాలతో ఆలయం, పరిసరాలు మార్మోగాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాట్లు చేసింది.



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రేపటి నుంచి మహా కుంభాభిషేక పూజలు

ఓల్డ్‌మలక్‌పేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో గల గరుడ అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మహా కుంభాభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ చేగూరి వెంకటరమణ తెలిపారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు బి. వివేకానంద, ఎం. కృష్ణ, జి. బాలాజీ, విశ్వం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శిగా జగదీశ్వర్‌రావు

ఎల్‌బీనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(ఏపీఎన్‌జీజీఓస్ అసోసియేషన్) రాష్ట్ర ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన కిలారు జగదీశ్వర్‌రావు నియమితులయ్యారు. జగదీశ్వర్‌రావు నియామకాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ప్రకటించారు. జగదీశ్వర్‌రావును నగరంలోని ఆయన సహచరులు, అనుచరులు, అభిమానులు సన్మానించారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పీఅండ్‌టీ కాలనీ, డబీర్‌పురా ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కోదండరాంనగర్, కాలాడేరా ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ పేర్కొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు

చాదర్‌ఘాట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లో పలు ప్రాంతాలకు నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని పలువురు కాలనీవాసులు ఫిర్యాదు చేస్తున్నారు. నాలుగైదు రోజుల నుంచి ఫిర్యాదులు రావడంతో జలమండలి అధికారులు స్పందించారు. ముసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ వెంకటేశ్వరస్వామి స్వాగత తోరణం జంక్షన్ వద్ద తాగునీరు కలుషితం అవుతున్నట్లు జలమండలి ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారు. సివరేజీ పైప్‌లైన్ పగిలి మురుగునీరు తాగునీటిలో కలిసి సరఫరా అవుతోంది. కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు చేపట్టామని జలమండలి మలక్‌పేట డివిజన్ డీజీఎం హస్మత్ అలీ తెలిపారు.

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బలాల

ముసారాంబాగ్ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలకు కలుషిత నీరు సరఫరా అవుతుందని సమాచారం అందుకున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల బుధవారం అధికారులు చేపట్టిన పనులను పరిశీలించారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి

ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో రూ. 24 లక్షలతో సీసీ రోడ్డు

చాదర్‌ఘాట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో రూ. 24 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్‌రావు, బీజేపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు యాదగిరి సురేందర్, శానిటేషన్ ఎస్‌ఎఫ్‌ఏ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న హయత్‌నగర్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

మధురానగర్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన

హయత్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి బుధవారం పర్యటించారు. ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జలమండలి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అమల్, నరేష్, యాదగిరి, ప్రసాద్, మహేశ్వరి పాల్గొన్నారు.



సీఐ నాగరాజుగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం, బీజేపీ నాయకులు

గోవధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

హయత్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గోవధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని బీజేవైఎం హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర ప్రేమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐ నాగరాజుగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు బండారు భాస్కర్ మాట్లాడుతూ శివారు ప్రాంతాల నుంచి గోవులను నగరానికి తరలించి వధిస్తున్నారని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసి గోవులను నగరానికి తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీను, నాయకులు సత్యనారాయణ, మహేష్, వస్పరి వెంకటేశ్, నవీన్‌యాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి

హయత్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి. యాదయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తుర్కయంజాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో అన్ని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం తుర్కయంజాల్ మునిసిపాలిటీ కార్యదర్శి కిషన్, సత్యనారాయణ, అరుణ్‌కుమార్, శారద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యాంసుందర్

కార్యవర్గం ఎన్నికపై అసత్య ప్రచారం చేయొద్దు

సైదాబాద్. జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.శ్యాంసుందర్ అన్నారు. బుధవారం కాలనీ అధ్యక్షుడు కె. రాజిరెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 18న ఎన్నికల అధికారి పుల్లారెడ్డి, కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు శేషిరెడ్డి ఆధ్వర్యంలో కాలనీసభ్యుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారని గుర్తు చేశారు. ఇప్పటికే ప్రధాన కార్యవర్గం ఎన్నిక కాగా కొందరు ఈ నెల 29న ఎన్నికలు జరుగుతాయని తప్పుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు.

కారులో కూర్చునే విధులు

- కార్యాలయంలోకి అడుగుపెట్టని 'సమేటి' డైరెక్టర్

ఓల్డ్‌మలక్‌పేట జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కారులో కూర్చునే ఓ అధికారి విధులు నిర్వహిస్తున్నారు. ఓల్డ్‌మలక్‌పేటలోని వ్యవసాయ శిక్షణ కార్యాలయం సమేటి (స్టేట్ అగ్రికల్చరల్ మేనేజ్‌మెంట్ అండ్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్)లో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.నారిమణి ప్రతీరోజు కార్యాలయంలోకి వెళ్లకుండానే కారులో కూర్చుని విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం కార్యాలయానికి వెళ్లిన ఆంధ్రజ్యోతికి ఈ దృశ్యం కనిపించింది. సిబ్బందిని విషయం అడగగా.. కొంతకాలంగా అధికారి కార్యాలయంలోకి రాకుండానే కారులోనే ఉండి విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిబ్బంది ఫైల్స్ తీసుకొచ్చి ఆమెతో సంతకాలు చేయించుకొని తీసుకెళ్తున్నారు. ఈ విషయమై డైరెక్టర్‌ను 'ఆంధ్రజ్యోతి' అడిగే ప్రయత్నం చేయగా.. ఆమె మాట్లాడటానికి ఆసక్తి చూపలేదు. డైరెక్టర్ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



కారులో కూర్చున్న డైరెక్టర్ వద్దకు వచ్చిన సిబ్బంది

స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

ఎల్‌బీనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదినోత్సవాన్ని తెలంగాణ మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ నాయకత్వంలో ప్రతినిధులు ప్రసాద్‌కుమార్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు చౌడాపూర్ వెంకటేష్, ఐక్యవేదిక రంగారెడ్డి జిల్లా నాయకులు పెటిక కృష్ణ ప్రకాష్, వల్లమళ్ల ప్రవీణ్, నాలుకల నర్సింగ్‌రావు, జంగ్లీ కిషన్, వసంత్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బేర బాలకిషన్ తదితరులు

9 నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

మన్సూరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆదిత్యనగర్ కాలనీలోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆస్మాన్‌ఘడ్‌లో విషాదఛాయలు

సైదాబాద్. జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ చౌరస్తాలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందడంతో ఆస్మాన్‌ఘడ్ గాంధీనగర్‌లో విషాదఛాయలు నెలకొన్నాయి. గాంధీనగర్‌కు చెందిన అబ్దుల్ అక్బర్ భార్య సీమాబేగం(26), కుమార్తెలు మదిహా(4), ఐరా(3)తో కలిసి డబీర్‌పురాలో అత్తగారింటికి వెళ్లి మంగళవారం రాత్రి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నారు. చంచల్‌గూడ చౌరస్తా దాటగానే వెనక నుంచి వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి వారిని ఢీకొట్టి డివైడర్ పైకి ఎక్కి ఆగిపోయింది. ఈ ఘటనలో సీమా బేగం అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన అక్బర్, మదిహా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ సైదాబాద్ జయనగర్‌కు చెందిన అబ్దుల్ సలీంగా గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

సైదాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. పూసల బస్తీలో నివసిస్తున్న పి. నాగరాజు, సంధ్య(28) దంపతులు. గతనెల 26వ తేదీ తెల్లవారుజామున భర్త, పిల్లలు నిద్రపోతున్న సమయంలో సంధ్య దుస్తులు బ్యాగ్‌లో సర్దుకొని బయటకు వెళ్లింది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త నాగరాజు బుధవారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంధ్య

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి

సైదాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భవనం పై నుంచి పడిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దంత వైద్యుడు అబ్దుల్ ఖయ్యూం ఖాన్ భవనంపై నుంచి ఇటీవల సుమారు 40 సంవత్సరాల వయస్సుగల గుర్తుతెలియని వ్యక్తి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. డాక్టర్ సమాచారం మేరకు పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.